## బాల సదన్, శిశు గృహాల సందర్శన



పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్

కోర్టుచౌరస్తా, మే 22: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ ఆధ్వర్యంలో నగరంలోని బాలసదన్, శిశుగృహాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆయన ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. చదువులో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు న్యాయమూర్తి బహుమతులు అందించారు. పిల్లల ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని, ఎలాంటి న్యాయపరమైన, న్యాయ సేవలు అవసరమైన న్యాయసేవాధికార సంస్థలను సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

కలెక్టరేట్, మే 22: దళిత జాతి అభ్యున్నతే లక్ష్యంగా అవిరళ కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మాతాశిశు సంరక్షణ కేంద్రం సమీపంలో గల ఆయన విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతితో పాటు పలువురు అధికారులు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దళితుల ఉన్నతి కోసం, వారికి విద్యనందించేందుకు భాగ్యరెడ్డి వర్మ ఎంతగానో శ్రమించారని కొనియాడారు. 1906 నుంచి 1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలు స్థాపించి, వారి భవిష్యత్‌కు గట్టి పునాదులు వేశారని గుర్తుచేశారు. నేటి యువత భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు పాటుపడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మహేశ్వర్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పవన్‌కుమార్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణచౌక్/జమ్మికుంట, మే 22: నగరంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి జయంత్యోత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, వైస్ చైర్మన్ రమేశ్, ప్రధాన కార్యదర్శి లింగయ్య, కోశాధికారి కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, మాల సంఘం నాయకుడు మేడి సత్యం, అంజయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

## సైబర్ నేరాల కీలక నిందితుడి అరెస్ట్




నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ శుభం ప్రకాశ్

మానకొండూర్ రూరల్, మే 22: ఓ యువకుడిని సైబర్ నేరాల ఉచ్చులోకి లాగి చిత్రహింసలకు గురి చేసిన గుజరాత్‌కు చెందిన కీలక నిందితుడిని మానకొండూర్ పోలీసులు ఢిల్లీలో అరెస్టు చేశారు. గురువారం కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ వివరాలు వెల్లడించారు. మానకొండూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన కొక్కిరాల మధుకర్ రెడ్డి 'చైనీస్ జాబ్' అనే టెలిగ్రామ్ చానెల్‌లో వచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌ను చూసి సంప్రదించాడు. గుజరాత్‌కు చెందిన హితేష్ అనే వ్యక్తి ఇంటర్వ్యూ చేసి, ఇండియా నుంచి ఉద్యోగ కోసం థాయ్‌లాండ్‌కు తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత సైబర్ నేరాలు చేయాలని చిత్ర హింసలు పెట్టగా, ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ చొరవతో మధుకర్ రెడ్డిని స్వదేశానికి తీసుకొచ్చారు. మధుకర్ రెడ్డిని మోసం చేసిన ప్రధాన నిందితుడు గుజరాత్‌కు చెందిన హితేష్‌ను మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఆఫైర్స్ ఆదేశాల మేరకు మయన్మార్ ప్రభుత్వం స్వదేశానికి పంపింది. ఇండియాకు వస్తుండగా బుధవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్ పోర్టులో మానకొండూర్ పోలీసులు సీఐ సంజీవ్ అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. గురువారం కరీంనగర్ కోర్టులో రిమాండ్ కోసం హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన మానకొండూర్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని ఆయన అభినందించారు.

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి




మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 22 : ముందస్తు వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన, పాత ఇండ్లు వర్షాలకు నాని కూలిపోయే ప్రమాదం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయవలసిందిగా సూచించాలని తెలిపారు. ఐరన్ విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు సూచించారు. మున్సిపల్ శాఖలోని డీఆర్‌ఎఫ్ టీం అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్లను వినియోగించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

***జిల్లాలో భారీ వర్షం***

కలెక్టరేట్, మే 22 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై చూపుతున్నది. గడిచిన 24 గంటల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీగా జల్లులు పడగా, రహదారుల పక్కన ఉన్న గుంతల్లో నీరు నిలిచింది. గురువారం మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమై ఉండగా, అనంతరం ముసురు కమ్మడంతో దైనందిన కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో నైరుతి రుతుపవనాల చురుకుగా కదులుతుండడంతో మరో రెండు రోజులు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్ర అధికారులు పేర్కొంటున్నారు.

శంకరపట్నం, మే 22: మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షంతో ఎన్‌హెచ్ 563 రహదారిపై ప్రయాణికులు, పాదచారులు వరద నీటితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాలి లోతు వరకు వరద నీటిలో వాహనాలు ప్రయాణించాయి. కాగా, నీటిని రోడ్డుపై నుంచి మళ్లించేలా చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడిలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి, మే 22: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, సాగునీటి సమస్య లేకుండా పరిష్కరించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలన్నారు. సమావేశానికి పీసీసీ పరిశీలకులుగా రఘునాథ్ రెడ్డి, నమిలా శ్రీనివాస్ హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించగా, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, మహిళా అధ్యక్షురాలు పోలు స్వప్న, జిల్లా నాయకులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

కమాన్‌చౌరస్తా, మే 22: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రదమైనదని, అందకనుగుణంగానే ఉపాధ్యాయులు నడుచుకోవడం గొప్ప విషయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్లు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, జయపాల్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

విద్యానగర్, మే 22 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ డెలివరీలు జరిగేలా ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. గురువారం ఎంఎల్‌హెచ్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్స్, సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సభల రిపోర్టులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారీగా సమీక్షించారు. సిజేరియన్ డెలివరీ కావాలని చేయించుకోవడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను గర్భిణితో పాటు ఆమె కుటుంబ సభ్యులకు తెలపాలన్నారు. డ్రై డే, ఆరోగ్య పరీక్షలు, క్షయ నిర్ధారిత కేసులకు చికిత్స అంశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు కొనసాగే రెండో విడుత ఇమ్యునైజేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజిదా, పీవో ఎంసీహెచ్ డాక్టర్ సన జవేరియా, డీఎంవో డాక్టర్ శైలేంద్ర, డెమో రాజగోపాల్, డీపీఎం స్వామి, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజరి స్టాఫ్ పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి స్నేహితుల చేయూత

చిగురుమామిడి, మే 22: ఇందుర్తి గ్రామంలో ఇటీవల బొడ్డు పరశురాములు అనే వ్యక్తి మృతి చెందగా, బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు చేయూతనందించారు. 1995- 96 సంవత్సరంలో పరశురాములతో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు, అతడి కూతురు పేరిట 50వేల రూపాయలను పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి డిపాజిట్ పత్రాన్ని గురువారం పరశురాములు భార్య, కూతురుకు అందజేశారు. ఇక్కడ ఎస్‌కే సిరాజ్, తదితరులు ఉన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 22 : ఇంటర్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా, మొదటి సంవత్సరం సంవత్సరంలో మొత్తం 3244 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 2967 మంది హాజరై, 277 గైర్హాజరయ్యారు. అలాగే, రెండో సంవత్సరంలో మొత్తం 835 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 755 మంది విద్యార్థులు హాజరు కాగా, 80 మంది గైర్హాజరయినట్లు డీఐఈవో గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రికెట్ క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న కమిషనర్

కార్పొరేషన్/ కొత్తపల్లి, మే 22: జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న ఉచిత సమ్మర్ క్యాంప్‌ను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం సందర్శించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు క్రీడల్లో కొనసాగుతున్న శిక్షణలను పరిశీలించి వాటి తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంగా పాలు, గుడ్డు, అరటి పండ్ల పంపిణీని పరిశీలించారు. క్రికెట్‌తో పాటు పలు క్రీడలకు సంబంధించిన పరికరాలను కమిషనర్ కోచ్‌లకు అందజేశారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, శిబిరాల్లో నేర్చుకుంటున్న మెళకువలతో పోటీల్లో రాణించాలన్నారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్, ఏఈ సతీశ్, కోచ్‌లు పాల్గొన్నారు.

## ఉద్యమంలా మొక్కలు పెంచాలి

కార్పొరేషన్, మే 22 : మెప్మా ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి) నినాదంతో నగరపాలక సంస్థ పరిధిలో ఉద్యమంలా మొక్కలు నాటి పెంచడంలో మహిళలను భాగస్వాములను చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. ఇందులో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో మహిళా సంఘం సభ్యులను గుర్తించి వనమహోత్స కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎంపిక చేసిన మహిళా సంఘం సభ్యులు జూన్ 5 నుంచి గుర్తించిన చెరువుల సమీపంలో ఉద్యమంలా మొక్కలు నాటి రెండు సంవత్సరాల పాటు వాటి సంరక్షణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వేణు మాధవ్, డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, ఈఈ శ్రీనివాస్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ సల్మాన్, డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ మానస, సీవోలు సునీత, పద్మ, దీప, అంజలి, స్వప్న, పద్మ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను అభినందించిన కమిషనర్

కొత్తపల్లి, మే 22 : ఈనెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపికైన జీనియస్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులను నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం అభినందించారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన అండర్-9 చదరంగ పోటీల్లో పాల్గొన్న జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు ఉమాంగ సోనీ, దేవేంద్రసింగ్, శ్రీవాస్తవ్, శ్రీహాన్, శ్రీహంసిని అద్భుత ప్రతిభ చూపి, రాష్ట్ర చదరంగ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జీనియస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ సృజన్, డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, బాధ్యులు అభిరాం, రేవిక్, అరుణ్, నితిన్, ప్రభు, చంద్ర, శ్రీనిజ, స్వాతి, వరుణ్ పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



భగత్‌నగర్‌లోని అంజనాద్రి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కమాన్‌చౌరస్తా, మే 22 : జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో నగరంలో హిందూ ఏక్తాయాత్ర అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'క్లారిటీ లేని పెండింగ్ బిల్లుల విడుదల'

గంగాధర, మే 22 : పెండింగ్ బిల్లుల విడుదలలో ప్రభుత్వానికి క్లారిటీ లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌సీ, సీడీఎఫ్, ఎస్‌డీఎఫ్ నిధులకు సంబంధించిన ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి?.. ఎంత శాతం విడుదల చేశారు అన్నదానిపై క్లారిటీ లేదని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో నిధులు ఉండి, ఎంబీ రికార్డు అయ్యి, చెక్కు జనరేట్ చేసిన వాటి బిల్లులు గతంలో రిజెక్ట్ అయ్యాయని, వాటికి సంబంధించిన బిల్లులను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఎంబీలు రికార్డు అయి, చెక్కు జనరేట్ కాని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'బోనస్ బోగస్ అయినట్లేనా?'

గంగాధర, మే 22: సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ బోగస్ అయినట్లేనా అని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం హామీ మేరకు బోనస్ వస్తుందన్న నమ్మకంతో చాలా మంది రైతులు సన్న వడ్లను సాగు చేశారని, బోనస్ చెల్లింపు ఆలస్యం కావడంతో రైతులు నష్టపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయిన రైతులు యాసంగిలో దొడ్డు వడ్లు సాగు చేయడానికి మొగ్గు చూపారని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొదటికే మోసం వస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. తేమతో సంబంధం లేకుండా తడిసి, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వర్షంతో నిలిచిన ధాన్యం తరలింపు



నగునూర్‌లో వర్షానికి తడవకుండా టార్పాలిన్ కప్పి ఉంచిన తూకం వేసిన ధాన్యం

కరీంనగర్ రూరల్, మే 22: నగునూర్‌లో కరీంనగర్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో వర్షం కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయింది. తూకం వేసినా, వర్షం కురుస్తుండడంతో రెండు రోజులుగా లారీల్లో లోడ్ చేయలేని పరిస్థితి నెలకొన్నది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## 'ఆదర్శ' ఉచిత వైద్యశిబిరం



పరీక్షిస్తున్న వైద్యురాలు

తిమ్మాపూర్, మే 22: మండలంలోని రామకృష్ణకాలనీలో కరీంనగర్‌లోని ఆదర్శ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 200మందికి డాక్టర్ మానస, తేజస్విని, హృదయ్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు రాసిచ్చారు. అవసరమైన వారికి ఆపరేషన్లకు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు గుజ్జుల తిరుపతిరెడ్డి, హాస్పిటల్ ఎండీ కరివేద సత్యనారాయణరెడ్డి, వైద్యులు సునీల్ రాజ్, కళ్యాణ్, మానస, మేనేజర్ రామకృష్ణ, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Dandem Sumalatha W/o Mysaiah (Old Name), H.No. 3-11, R/o Rajannapet, Yellareddypet Mandal, Rajanna Sircilla Dist. My Name is changing to Bathula Renuka W/o Mysaiah D/o Yellaiah (New Name)
NTK-330317

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## గురుకులాల ఎత్తివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

కమాన్‌చౌరస్తా, మే 22 : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. జిల్లాలోని చొప్పదండి ఎస్సీ బాలికల గురుకుల కూడా తీసేసే జాబితాలో పొందుపరిచారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం తన తక్షణమే వెనక్కి తీసుకొని గురుకులాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని గురువారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

## కొత్త ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలి

కరీంనగర్ రూరల్: మే 22: పాత ఈ పాస్ యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు తీసుకొని ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి జె. భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం కృషి భవన్‌లో కరీంనగర్ రూరల్ మండలంలోని ఎరువుల డీలర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎరువుల దుకాణాల యాజమానులు తప్పక ఈ పాస్ యంత్రాలు తప్పక వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు ఈ పాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో టెక్నీషియన్ స్వప్న, మండల వ్యవసాయ అధికారి బి. సత్యం, క్రిబ్‌కో రీజినల్ మేనేజర్, టెక్నీషియన్స్, ఫెర్టిలైజర్‌షాపు డీలర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 22: నగరంలో కొత్త డీటీఆర్, ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 11.30గంటల వరకు శ్రీనగర్ రోడ్డు నంబర్ 5, 6, 7, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పద్మనగర్, ఉదయం 9.30నుంచి 10.30గంటల వరకు పద్మ నగర్, పారమిత స్కూల్, మానేరు స్కూల్, మార్క్‌ఫెడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కార్పొరేషన్, మే 22 : నగరపాలక సంస్థ పరిధిలో హోర్డింగులు అడ్వర్‌టైజింగ్ బోర్డులు ఏర్పాటు చేసే ఏజెన్సీలు ఈ నెల 30లోగా నగర పాలకసంస్థ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు బోర్డుల భద్రతకు సంబంధించిన అన్ని ఆధార పత్రాలను సమర్పించాలని సూచించారు.

## 19 మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, మే 22 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన 19 మందిపై కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరైన ఏడుగురు, కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, శివాణి డిగ్రీ కళాశాలలో ముగ్గురు, వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ధర్మపురి ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్‌ఏ కళాశాలలో ముగ్గురు పరీక్షకు హాజరై మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు తెలిపారు.

## అడిషనల్ డీసీపీగా వెంకటరమణ

విద్యానగర్, మే 22 : కరీంనగర్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా ప్రతాపగిరి వెంకటరమణకు పోస్టింగ్ ఇచ్చారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వెంకటరమణకు ఖాళీగా ఉన్న అడిషనల్ డీసీపీ పోస్టు కేటాయిస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

## ఏసీపీ బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్ టౌన్, మే 22: హుజూరాబాద్ నూతన ఏసీపీగా వాసంశెట్టి మాధవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం హుజూరాబాద్ ఏసీపీగా పనిచేసిన సీహెచ్ శ్రీనివాస్ జీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, కరీంనగర్‌లో పనిచేస్తున్న మాధవి హుజూరాబాద్‌కు బదిలీపై వచ్చారు.

## ఉమెన్ ఫర్ ట్రీస్ సన్నాహక సమావేశం

హుజూరాబాద్ టౌన్, మే 22: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కేసీ క్యాంపు, ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్క పేటలలో గురువాం తెలంగాణ ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధిలోని మహిళా సంఘాల సభ్యులందరూ ఎంపిక చేసిన స్థలాల్లో వర్షాకాలంలో మొక్కలను నాటి రెండు సంవత్సరాల వరకు వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో, మున్సిపల్, వార్డు అధికారులు, మెప్మా ఏడీఎంసీ మల్లీశ్వరి, సీఎల్ఆర్పీలు రమాదేవి, స్వరూప, ఆర్పీలు, పలు మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## నేడు ఆర్‌వైవీఎస్ అభ్యర్థుల ఇంటర్వ్యూ

చిగురుమామిడి, మే 22: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ ప్రకటనలో తెలిపారు. చిగురుమామిడి, బొమ్మనపల్లి, రేకొండ, సుందరగిరి, నవాబ్ పేట్, ఇందుర్తి గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వ్యవసాయ ఆధారిత పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు భూమికి సంబంధించిన పాసుబుక్కులు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

## ఆలయ మండప నిర్మాణానికి విరాళం

హౌసింగ్ బోర్డు కాలనీ, మే 22: నగరంలోని 8వ డివిజన్ అల్గునూర్ శ్రీ లక్ష్మీగణపతి ఆలయ మండప నిర్మాణానికి ఇనుకొండ రాధ -మల్లారెడ్డి దంపతులు గురువారం రూ.3 లక్షల 16 వేలు విరాళంగా ఆలయ ట్రస్టుకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్ తరపున బాధ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ రూరల్, మే 22: రేకుర్తిలోని ఓ ఇంట్లో పేకాడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి 3,65,760 రూపాయలు, 14 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## సింగిల్ విండో విధానంలో హెచ్‌టీ సర్వీసులు

ముకరంపుర, మే 22: ఎన్పీడీసీఎల్ సింగిల్ విండో విధానంలో హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు శ్రీకారం చుట్టిందని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ, 33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరును వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను సంస్థ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. సర్వీసుల మంజూరు ప్రక్రియ సులభతరం చేసేందుకు ప్రత్యేకంగా హెచ్‌టీ మానిటర్ సెల్ సర్కిల్, కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటైందని తెలిపారు. ఈ విధానంలో త్వరితగతిన సర్వీసుల మంజూరుతో పాటు దరఖాస్తుదారు కార్యాలయాలకు రాకుండానే ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. దరఖాస్తు దారులకు దరఖాస్తుల స్థితిపై ఎప్పటి కప్పుడు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

## వృత్తి నైపుణ్య శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి/చొప్పదండి, మే 22 : చింతకుంట, రుక్మాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో చదువుకొని ఎలాంటి ఉద్యోగం పొందని వారికి ప్రభుత్వ చొరవతో ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణలు ఇవ్వనున్నారని, దీనికి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు ఎ. లక్ష్మి, కాళహస్తి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. శిక్షణలకు 18 నుంచి 25 సంవత్సరాల్లోపు వయసు గల పూర్వ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు చింతకుంట కళాశాల పూర్వ విద్యార్థులు 9000049542 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## ఆర్థిక సాయం అందజేత

గంగాధర, మే 22 : ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన బరిగె శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, గురువారం మల్లాపూర్ గ్రామానికి చెందిన నాయకుడు తూడి లచ్చయ్య పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన లచ్చయ్యకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు ముద్దం నగేశ్, ఆళ్ల విజేందర్‌రెడ్డి, పిట్టల మనోహర్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి భోజనశాల




బస్టాండ్‌లో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన భోజనశాల

తెలంగాణచౌక్, మే 22: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బంది కోసం భోజనశాలను ఏర్పాటు చేశారు. నిత్యం లక్షల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లు, కండకర్లతోపాటు ఇతర సిబ్బంది భోజన సమయంలో బస్టాండ్ ఆవరణలో బస్సుల్లో, చెట్ల కింద భోజనం ముగించేవారు. ఎండ తీవ్రత, వర్షాలు పడే సమయంలో ఇబ్బందులు పడేవారు. సిబ్బంది ఇబ్బందులను గుర్తించి ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్టాండ్‌లో కుర్చీలు, వాష్ బేషన్. ఫ్యాన్, తాగునీటి సౌకర్యాలతో భోజనశాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.